# గోదావరి జలాల కోసం ఎదురుచూపు

- లద్నూర్ రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టం
- ఎండిన రిజర్వాయర్ ప్రధాన కాల్వ
- ఆందోళనలో మద్దూరు మండల రైతులు


నీటి మట్టం తగ్గిన లద్నూర్ రిజర్వాయర్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 20 : ఏడాదంతా నిండుకుండలా ఉండే రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గింది. నిన్నమొన్నటి వరకు గోదావరి జలాలతో సవ్వడి చేసిన ఆ కాల్వ ఎండిపోయి ఎక్కిరిస్తుంది. ఎప్పటి మాదిరిగానే కాల్వ ద్వారా నీరందుతుందని కోటి ఆశలతో సాగు పనులు మొదలు పెట్టిన రైతన్నలు ఆదిలోనే అరిగోసపడుతున్న పరిస్థితులు ప్రస్తుతం మద్దూరు మండలంలో నెలకొన్నాయి. మండలంలోని లద్నూర్ రిజర్వాయర్ కొన్నేండ్లుగా గోదావరి జలాలతో కళకళలాడేది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి మట్టం సగానికిపైగా తగ్గింది. దీంతో రిజర్వాయర్ నుంచి ప్రధాన కాల్వలోకి నీటి విడుదలను నిలిపివేశారు. కాల్వ నీటినే నమ్ముకొని లద్నూర్, మర్మాముల, ధర్మారం, మద్దూరు గ్రామాల్లో వంద ఎకరాలకు పైగా రైతులు పంటలను సాగుచేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే ఈ యాసంగిలో రైతులు సాగు పనులు మొదలు పెట్టారు. అయితే రిజర్వాయర్‌లోకి అధికారులు గోదావరి జలాలను విడుదల చేయకపోవడంతో రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో నీరు లేక పొలాలు బీటలు పారుతున్నాయి. నాట్లు వేసిన వరి నారు ఎండిపోతున్నది. నాటు వేసేందుకు సిద్ధంగా ఉన్న నారు కూడా ఎండిపోతుంది.


రిజర్వాయర్ ప్రధాన కాల్వ దుస్థితి


మద్దూరులో ఎండిపోతున్న నారుమడిని చూపుతున్న రైతులు

**కాల్వ నీటిని నమ్ముకొనే ఎవుసం చేస్తున్నాం..**



రిజర్వాయర్ కాల్వ పక్కనే నాకు ఎకరం పొలం ఉన్నది. మూడు, నాలుగేండ్లుగా కాల్వ నీటిని నమ్ముకొనే ఎవుసం చేసుకొని బతుకుతున్నం. రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్లు రాకపోవడంతో కాల్వ నీటిని బంద్ చేశారు. ఇప్పుడు మేము ఎవుసం ఎట్లా చేసుకునేది. గవర్నమెంట్ వెంటనే మా పొలాలలోకి నీళ్లు వచ్చే విధంగా చూడాలే. లేకపోతే కష్టమైతది.

**– మానేపల్లి దశరథం, రైతు, లద్నూర్**

**ఏడాదంతా కాల్వలో నీళ్లుండేది..**



ఈ మూడు నాలుగేండ్ల నుంచి ఈ కాల్వ నిండా నీళ్లు పారేది. అంతేకాకుండా ఎండ కాలం వచ్చిందంటే ఈ కాల్వ నుంచే గాగిల్లాపూర్ పెద్ద చెరువులోకి కూడా నీళ్లు పోయేది. ఇప్పుడు మాత్రం గోదావరి నీళ్లు రిజర్వాయర్‌లోకి ఎందుకు వదులుతలేరో అర్థం కావడం లేదు. గోదావరి నీళ్లు వస్తేనే బతుకుదెరువు, లేకపోతే కష్టమైతది. ప్రభుత్వం వెంటనే స్పందించి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను విడుదల చేయాలి. లేకపోతే రైతులమంతా కలిసి ఆందోళనకు దిగుతాం.

**– జక్కుల ఎల్లయ్య, రైతు, ధర్మారం**

దీంతో కాల్వ పరీవాహక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే గోదావరి జలాలతో లద్నూర్ రిజర్వాయర్‌ను నింపాలని మండల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఉపాధి కూలీల హక్కులను రక్షించాలి


మాట్లాడుతున్న డీబీఎఫ్ శంకర్

మిరుదొడ్డి, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీ పనుల హక్కులను కాల రాస్తూ, కూలీల పొట్ట గొడుతుందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ (డీబీఎఫ్) కార్యదర్శి పెద్దలింగన్న గారి శంకర్ అన్నారు. శనివారం లింగుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజుల్లో కూలి డబ్బులు చెల్లించాల్సి ఉండగా, 75 రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీడీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## రైతుబంధు ఇచ్చి రుణమాఫీ చేయాలి

గజ్వేల్, జనవరి 20 : ప్రభుత్వం వెంటనే రైతు రుణమాఫీ చేసి యాసంగి పంటల సాగు కోసం రైతుబంధు డబ్బులను వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. ఎల్లయ్య అన్నారు. ఈసందర్భంగా గజ్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పెట్టుబడికి అందించే రైతుబంధు డబ్బులను బ్యాంకు ఖాతాలో వెంటనే వేయాలని కోరారు. అదే విధంగా ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు కనకయ్య, ఐలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

## దేవాలయ భూములను పరిరక్షించాలి


ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జనవరి 20 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి పాలక మండలి సమావేశం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొని నిర్వహించడం సిగ్గు చేటని, సమావేశంలో పాల్గొన్న అధికారులతో పాటు కొమ్మూరిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల శాఖ అధికారులు ఈవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ దేవాలయానికి కేటాయించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడిగె కృష్ణారెడ్డి, సర్పంచ్ తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బాలకిషన్, తాడూరి మల్లేశం, సాయిలు, భిక్షపతి పాల్గొన్నారు.

## హమాలీలకు ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షల కోసం క్యూలైన్‌లో వేచివున్న హమాలీ కార్మికులు

హుస్నాబాద్, జనవరి 20 : పట్టణంలోని హమాలీ కార్మికులకు స్థానిక సర్కారు దవాఖానలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్, ఆదర్శ హమాలీ సంఘాల సభ్యులు 123 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు దవాఖాన సూపరిండెంటెండ్ డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. బీపీ,షుగర్, కిడ్నీ సంబంధిత ఫంక్షనింగ్, థైరాయిడ్ తదితర పరీక్షలతో కలిపి మొత్తం 54 రకాల రక్త పరీక్షలు చేసి ఒక్కో కార్మికుడికి వేర్వేరుగా రిపోర్టులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ పరీక్షల ద్వారా కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఏమిటో తెలుస్తుందని, సమస్య ఉంటే సులభంగా వైద్య చికిత్సలు అందించవచ్చని డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థి భావనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


దుబ్బాక, జనవరి 20 : రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు (వైజ్ఞానిక ప్రదర్శనకు) సిద్దిపేట జిల్లా నుంచి దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సిద్దిపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన (డీఎల్‌ఎస్‌ఎంఈఈ) సైన్స్ ఫెయిర్‌లో గణిత విభాగానికి చెందిన కంప్యూటర్ థింకింగ్‌లో పాఠశాల విద్యార్థి జి.భావన ప్రదర్శించిన ట్రిగ్నోమెట్రిక్ పార్క్, మ్యాథమెటిక్స్ మోడల్ కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.

## 'గురుకులాల భద్రత - మన బాధ్యత'

సిద్దిపేట టౌన్,జనవరి 20 : 'గురుకులాల భద్రత–మన బాధ్యత' అని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గురుకులాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ గురుకులాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానంగా గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశం లో పవన్‌కుమార్, నందం, లావణ్య, సత్యం, అనిల్ పాల్గొన్నారు.

## 'నోటీసులు ఇవ్వకుండా కూల్చేశారు'

సిద్దిపేట, జనవరి 20 : ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు ప్రహరీని కూల్చివేశారని పసుపునూరి నిర్మల తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని 12వ వార్డులో పూసుపూనూరి నిర్మల మూడేండ్ల కింద ఇల్లు నిర్మించారు. 141 గజల స్థలంలో గానూ 120 గజల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి, మిగతా ప్రాంతంలో ప్రహరీ నిర్మించారు. ఈ నిర్మాణం చేపట్టి ఆరు నెలలు దాటి పోయిందని సదురు బాధితురాలు తెలిపారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మున్సిపల్ అధికారులు డైరక్ట్‌గా జేసీబీతో వచ్చి ప్రహరీ కూల్చివేశారాని తెలిపారు.


సిద్దిపేటలో కూల్చివేసిన ప్రహరీ

**పర్మిషన్ లేదు : మున్సిపల్ కమిషనర్**

సిద్దిపేట పట్టణంలోని 12వ వార్డు రాఘవేంద్రనగర్ కాలనీలోని పసుపునూరి నిర్మల ఇంటి పర్మిషన్ తీసుకొని పర్మిషన్‌కు విరుద్ధంగా కాంపౌండ్ వాల్‌ను రోడ్డుపైకి జరిగి నిర్మించినట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈ విషయమై చుట్టుపక్కల ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. గతంలోనే ఇలా నిర్మించినందుకు కాంపౌండ్‌వాల్ తొలిగించామన్నారు. అయినప్పటికీ మళ్లీ నిర్మించడంపై యజమానికి నోటీస్ ఇచ్చామన్నారు. మున్సిపల్ నోటీసును బేఖాతరు చేయడంతో కాంపౌండ్ వాల్‌ను తొలిగించామని తెలిపారు.

### బాలిక దినోత్సవంపై అవగాహన సదస్సు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 20 : హుస్నాబాద్ మోడల్‌స్కూల్‌లో శనివారం జాతీయ బాలిక దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాలు, లైంగికదాడులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భరోసా కేంద్రం నుంచి పి.హరితారెడ్డి, కె.సౌమ్య, స్త్రీశిశు సంరక్షణ కేంద్రానికి చెందిన వాసవి, నాగరాజు, సఖికి చెందిన మమత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

కొండపాక, జనవరి 20 : ఉపాధ్యాయ సమస్యలను వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘం నేతలతో మాట్లాడి పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా నాయకుడు చంద్రభాను అన్నారు. శనివారం దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులతో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

కొమురవెల్లి, జనవరి 20 : చేర్యాల డివిజన్ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలోని కురుమసంఘం భవనం ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా కమల్ల అనిల్, అధ్యక్షుడిగా ఓరుగంటి శంకర్, ప్రధానకార్యదర్శిగా అందె నాని, కార్యదర్శిగా జంగిలి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సూర్న శ్రీశైలం, కోశాధికారిగా బండారి కనకయ్య, సహాయ కార్యదర్శిగా జయరాములు, సలహాదారులుగా దయ్యాల రాజు, బింగి రాములుతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### నిందితుడికి జరిమానా

అక్కన్నపేట, జనవరి 20 : మండలంలోని గండిపల్లి గ్రామ పరిధిలోని మంజ్యతండాకు చెందిన ముడావత్ తిరుపతి బైండవర్‌ను ఉల్లంఘించి తిరిగి నేరానికి పాల్పడుతన్నాడు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ సంజీవ్ కుమార్ ఎదుట నిందుతుడిని హాజరుపరుచగా, రూ. 50 వేల జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. గతంలో నాటుసారా తయారీ, రవాణా, విక్రయం చేసిన ఘటనల్లో తిరుపతిపై పలు కేసులు నమోదయ్యాయి. అయితే ఇటీవల తిరుపతిని బైండోవర్ చేసినా, తిరిగి నాటుసారా రవాణా చేస్తు పట్టుబడటంతో కేసు నమోదు చేయడంతో పాటు బైండవర్ ఉల్లంఘన కింద తహసీల్దార్ ఎదుట హాజరుపరుచగా, రూ.50 వేల జరిమానా విధించారు. నిషేధిత నాటుసారా తయారీ, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

### వ్యాపారుల నిరసన

ములుగు, జనవరి 20 : చాలా మంది మర్వాడీలు వచ్చి వ్యాపారాలు పెట్టడంతో తాము జీవనోపాధి కోల్పోతున్నామంటూ ములుగు మండలం వంటిమామిడిలో శనివారం స్థానికులు ఆందోళనకు దిగారు. వంటిమామిడిలో స్థానికులు సుమారు 170 మంది పలు రకాల దుకాణాలను ఏర్పాటు చేసుకొని క్రయవిక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గడిచిన నాలుగేండ్ల వ్యవధిలో సుమారు 25 మంది మర్వాడీ కుటుంబాలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై స్థానికంగా తాము నష్టపోతున్నామని చైతన్య వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ విషయంలో సర్పంచ్ మహేశ్‌యాదవ్ జోక్యం చేసుకొని గ్రామస్తులతో కలిసి చర్చలు జరిపారు.

## అభివృద్ధి విషయంలో రాజీలేదు

గజ్వేల్ అర్బన్, జనవరి 20 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి ఏ విషయంలోనూ రాజీ పడేది లేదని, అన్ని పనులను నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ నిర్వహిస్తామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఒకటో వార్డు ఎస్సీ కాలనీలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, స్థానిక కౌన్సిలర్ బొగ్గుల చందు, వార్డు అధ్యక్షుడు స్వామిలతో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచనలిచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా అధ్యక్షుడు ఖరీం, నాయకులు అటుకూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్ ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

## హుస్నాబాద్‌ను స్వచ్ఛతలో ముందుంచాలి


శ్రీకాశీమరకత ఆలయాన్ని శుద్ధిచేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 20 : హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛతలో ముందుంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. పట్టణంలోని శ్రీకాశీమరకత శివాలయాన్ని శనివారం ఆలయ శుద్ధిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఆలయాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని సూచించారు. కమిషనర్ ఎంఆర్. రాజశేఖర్, కౌన్సిలర్లు రవి, రత్నమాల, హరీశ్, సుప్రజ, శ్రీనివాస్, రాజు, పద్మ, స్వర్ణలత, కో–అప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డితోపాటు మున్సిపల్‌కు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

తొగుట జనవరి 20 : మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావుపేటలో గుండెపోటుతో మృతి చెందిన సఫాయి కార్మికుడు ఈదుగాళ్ల భిక్షపతి కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.2500 నగదుతోపాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. శుక్రవారం మృతి చెందిన కల్లెపు చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షుడు పులిగారి శివయ్య, బూత్ అధ్యక్షుడు డబ్బికారి పెంటోజీ, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు నరేందర్, బీఆర్‌ఎస్ నాయకులు స్వామిగౌడ్, రాములు, చంద్రం, యాదగిరి, నరేశ్, అర్జున్, శేఖర్, పోచయ్య, రాంబాబు, నవీన్, కనకరాజు, ఎల్లం, నరసింహులు ఉన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి

## ఖైదీల్లో మార్పు రావాలి


మాట్లాడుతున్న అడిషనల్ జడ్జి మురళీమోహన్

సిద్దిపేట టౌన్, జనవరి 20 : ఖైదీల్లో సత్ప్రవర్తన రావాలని సిద్దిపేట అడిషనల్ జడ్జి మురళీమోహన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సబ్‌జైల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలిసి తెలియక తప్పు చేసి జైలుకు వచ్చారని భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్జి స్వాతిరెడ్డి, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు బాలయ్య, వెంకటేశ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

**రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, జనవరి 20 : వచ్చే వేసవిలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనుల వివరాలను త్వరగా అందజేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి నియోజకవర్గంలోని ఏడు మండలాల పంచాయతీరాజ్, రోడ్లు భవనాలశాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలోపు తాగునీటి నివారణ చర్యలు పూర్తిచేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 164 గ్రామ పంచాయతీల్లో ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లింకు రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అంగన్వాడీ, మహిళా భవనాలు, హెల్త్‌సెంటర్, వెటర్నరీ భవనాల స్థితిగతులు, కొత్తగా నిర్మించే భవనాల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసాచారి, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

వర్గల్, జనవరి 20 : జిల్లాలో నవోదయ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5796 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా, ప్రవేశపరీక్షకు 3734 మంది విద్యార్థులు హాజరయ్యారు. 2062 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 29 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించగా, గజ్వేల్‌లోని పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో బన్సీలాల్, విద్యాధికారులు సునీత, కరిమొద్దీన్ పర్యవేక్షించారు.

**ఆధార్ కార్డుతో ఇబ్బందులు..**

మిరుదొడ్డి, జనవరి 20 : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో శనివారం 195 మంది విద్యార్థులు నవోదయ పరీక్ష రాయాల్సి ఉండగా, 67 మంది గైర్హాజరయ్యారు. దీంతో 128 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షకు ముందు విద్యార్థులు తమ ఆధార్‌కార్డును చూపిస్తేనే సెంటర్‌లోకి అనుమతిస్తామని అధికారులు చెప్పడంతో కొందరు విద్యార్థుల వద్ద ఆధార్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మీ సేవ సెంటర్ వద్దకు వెళ్లి ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకురావడంతో సెంటర్‌లోకి అనుమతిచ్చారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పరీక్ష సమయంలో విద్యార్థులను ఆధార్ కార్డు తీసుకురమ్మని అధికారులు చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

మిరుదొడ్డి/బెజ్జంకి జనవరి 20 : గ్రామాల్లోని 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మిరుదొడ్డి బెజ్జంకి తహసీల్దార్లు గోవర్ధన్, శ్యామ్ అన్నారు. శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా 20 ఓటరు నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఫహీం, అంగన్ వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

దుబ్బాక, జనవరి 20 : లక్ష్యంతో విద్యనభ్యసిస్తే సత్ఫాలితాలుంటాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో హాజరై మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలపై విద్యార్థులు తమలో ఉన్న భయాన్ని వీడాలని సూచించారు. ఎంఈవో, హెచ్‌ఎం ప్రభుదాసు, టీచర్లు పాల్గొన్నారు.

### ఆర్టీసీ డిపో కార్మికుల క్రికెట్ టోర్నీ

గజ్వేల్, జనవరి 20 : గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగులు, కార్మికుల మధ్య శనివారం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీలో మెకానికల్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు ఇరు జట్లుగా పాల్గొని ఆడారు. ఈ సందర్భంగా డీఎం సురేఖ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉద్యోగులు కనకలక్ష్మి, జమీల్, జయపాల్, నాగేందర్, జనార్దన్ పాల్గొన్నారు. గెలుపొందిన వారికి 26న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు డీఎం తెలిపారు.

### ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్, జనవరి 20 : మండల పరిధిలోని రంగంపేట గ్రామానికి చెందిన యువతి బోనగిరి అనూష(16) శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్ శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాయకులు దుర్గారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ సిద్దిపేట్ హైవేలలో ప్రముఖ కార్ల షోరూంల యందు పనిచేయుటకు ''సెక్యూరిటీ గార్డులు'' కావలెను. పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత మంచి జీతం ఇవ్వబడును. స్వామి: 9392143108, 9652520827.
NT-313978

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

**EDUCATION**

★ Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.